గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ

రూ.14 కోట్లతో పర్యాటకాభివృద్ధి

- కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి - ఘనంగా పర్యాటక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి రూ.14 కోట్లతో ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వానికి పంపామన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటకదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి గణనీయంగా పెరుగనుందన్నారు. తద్వారా పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. జిల్లాలో కేవలం 7శాతం మాత్రమే అడవులు ఉన్నాయని దీన్ని 50శాతానికి పెంచే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. వేదవతి, గుండ్రేవుల మొదలగు నీటి ప్రాజెక్టులు పూర్తయితే భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. మహిళలు ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే రుణాలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. డిగ్రీ ఉంటేనే ఉద్యోగ అవకాశాలు ఉంటున్నాయని, ప్రతి ఒక్కరు డిగ్రీ పూర్తి చేసుకునే చర్యలు తీసుకొని తమ లక్ష్యాన్ని సాధించుకోవాలని జిల్లా సూచించారు. చిన్నారులు చారిత్రక వివరాలు తెలుపుతూ చేసిన నృత్య ప్రదర్శనలు, మోహన్‌బాబు చేసిన డాన్సింగ్ డాల్స్ ప్రదర్శనలు, గౌరవయ్యాల నృత్యం, కోలాటం ఆహుతులను అలరించాయి. జిల్లా కలెక్టర్ వారికి జ్ఞాపికలు అందజేశారు. డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి , టూరిజం శాఖ సలహాదారులు, టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య, జిల్లా టూరిజం, డివిజనల్ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు

జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ అధిక వర్షాలపై అధికారులతో సమీక్షించారు. రిజర్వాయర్లు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, నదీతీర ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో, ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు వర్షాల వల్ల ఏమైనా సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూమ్ నెంబర్ 08518 - 277305 కు ఫోన్ చేయాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

అన్న క్యాంటీన్లలో రుచికరమైన భోజనం : కలెక్టర్

అన్న క్యాంటీన్లలో రుచికరమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లలో భోజనం అంశంపై ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి సానుకూల స్పందన వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదివారం నుండి ఉదయం ఏడు గంటలకల్లా ఇందుకు సంబంధించిన ఫోటోలు తనకు పంపించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కర్నూలు నగరంలోని బృందావన్ నగర్ ,జోహరాపురం ప్రాంతాల నుండి ప్రజల నుండి పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని తెలిపారని, ఆ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జెసి డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, కర్నూలు అడిషనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, విసి ద్వారా ఆదోని మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవయ్యలకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

రేబిస్ నివారణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఛాంబర్‌లో డిఎంహెచ్ఒ డాక్టర్ పి.శాంతికళ ఆధ్వర్యంలో జాతీయ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రోగ్రాం అధికారులతో కలిసి శనివారం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28న లూయిస్ పాశ్చర్ వర్ధంతి సందర్భంగా వారు రేబిస్ వాక్సిన్‌ను కనుగొన్నందున గౌరవంగా 'జాతీయ రేబిస్ నివారణ దినోత్సవం" జరుపుకోంటున్నామని తెలిపారు. ఈ సంవత్సరము ' యాక్ట్ నౌయు, మీ కమ్యూనిటీ' (ఇప్పుడే - మీరు, నేను , సమాజము భాగస్వామ్యం తో రేబిస్‌ని నివారిద్దాం) అనే నినాదం తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. రేబిస్ అనేది కుక్కలు, పిల్లులు , అడవి జంతువుల ద్వారా మనుషులకు వ్యాప్తి చెందే ప్రమాదకరమైన వైరస్ వ్యాధి అన్నారు. ఒకసారి వ్యాధి వస్తే చికిత్స లేకుంటే ప్రాణాంతకమవుతుందన్నారు. అయితే రేబీస్ ను 100 శాతం నివారించవచ్చని అన్నారు. రేబీస్ నివారణకు కుక్కలు, పిల్లులు, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబీస్ వ్యాక్సిన్ వేయించాలని, వీధి కుక్కల నుండి జాగ్రత్త వహించాలన్నారు. కుక్క కరిచినప్పుడు తక్షణమే గాయాన్ని సబ్బుతో శుభ్రం చేసి, దగ్గరలోని ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలలో అవగాహన పెంచడం ద్వారా 'రేబీస్ ఫ్రీ సొసైటీ' సాధ్యమవుతుందని తెలిపారు. డిపిఎంఒ డాక్టర్ ఉమా, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబు, పిఒఆర్‌బిఎస్‌కె అండ్ ఎన్‌సిడి డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్, ఎస్ఒ హేమసుందర్, డెమో శ్రీనివాసులు శెట్టి, డిస్ట్రిక్ట్ ఎపిడమాలజిస్ట్ వేణుగోపాల్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు ప్రారంభం

-ఒడిశా నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారత ప్రభుత్వం చేపట్టిన ఆత్మ నిర్భర్ భారత్ లో భాగంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన బిఎస్ఎన్ఎల్ 4 జి సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం ఒడిశా లోని జార్సుగూడ నుండి ప్రారంభించారని కర్నూలు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ తెలిపారు. పత్తికొండ మండలం పులికొండ గ్రామంలో ఏర్పాటు చేసిన 4జి టవర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కర్నూల్ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి రమేష్ మాట్లాడుతూ జాతీయ సమాచార మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలో భాగంగా రూ. 37,500 కోట్లతో స్వదేశీ పరిజ్ఞానంతో (మేక్ ఇన్ ఇండియా) దేశ వ్యాప్తంగా అభివృద్ధి చేసిన 97,500 టవర్లను, దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 108 గ్రామాల్లో 4జి సేవలను ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభిస్తూ జాతికి అంకితం చేశారని తెలిపారు. ఇందులో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 10 గ్రామాల్లో, కర్నూలు జిల్లాలోని పత్తికొండ మండలం పులికొండ గ్రామంలో ఏర్పాటు చేసిన 4 జి శాచురేషన్ మొబైల్ టవర్‌ను ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారని తెలిపారు. ఈ స్వదేశీ 4జి నెట్వర్క్ ను సాఫ్ట్ వేర్ అప్డేట్ తో త్వరలో 5జీ గా ఆధునీకరించుకోవచ్చు అని తెలిపారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 376 టవర్లు 4జిగా మార్చామని తెలిపారు. అదనంగా 100కు పైగా 4జి టవర్లు స్యాచురేషన్, యాడ్ ఆన్ ప్రాజెక్టు కింద రాబోతున్నాయని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ 4జి ద్వారా డిజిటల్ చెల్లింపులు, డిజిటల్ లెర్నింగ్, స్మార్టర్ వ్యవసాయం, టెలి మెడిసిన్ వంటి కార్యక్రమాలను సులువుగా చేసుకోవచ్చని తెలిపారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, ఎమ్మార్వో హుస్సేన్ సాహెబ్, ఎంపిడిఒ కవిత , ఎలక్ట్రికల్ ఎడిఇ రామకృష్ణ , పులికొండ సర్పంచి ఎం. అనసూయమ్మ, బిఎస్ఎన్ఎల్ డిఇ రూరల్ నారాయణ స్వామి, ఏజీఎం సేల్స్ అండ్ మార్కెటింగ్ దేవచంద్ నాయక్, పత్తికొండ జెటిఒ తిరుమలేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కర్నూలు టెలిఫోన్ ఎక్స్చేంజిలో ఏర్పాటు చేసిన లైవ్ కార్యక్రమంలో ప్రస్తుత డిజిఎం సాయినాథ్ , డిఇలు, సంస్థ ఉద్యోగులు , ఫ్రాంచైజీలు తదితరులు పాల్గొన్నారు.

భూములు లాక్కుంటున్నారు..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రజా ప్రయోజనం కోసం అభివృద్ధి చేపడుతున్నామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చని పంట పొలాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నాయి. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో పచ్చని పైర్లతో కళకళలాడే పంట పొలాలపై కార్పొరేట్ కన్ను పడింది. మనేకుర్తి, హులేబీడు, కమ్మరచేడు గ్రామాల రెవెన్యూ పరిధిలో 192 ఎకరాల సాగు భూమిని రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసేందుకు సమాయత్తం అవుతోంది. మనేకుర్తికి చెందిన రైతుల నుండి 94.64 ఎకరాలు, హులేబీడు గ్రామానికి చెందిన 82.11 ఎకరాలు, కమ్మరచేడు గ్రామానికి చెందిన 15.016 ఎకరాలు భూసేకరణ చేయాలని నిర్ణయించింది. మొత్తం 74 మంది రైతుల నుంచి భూమి తీసుకోవాలని అనుకోగా 60 మంది రైతులు భూములు ఇవ్వబోమని వ్యతిరేకిస్తున్నారు. పత్తికొండ ప్రాంతంలో రైతులను మభ్యపెట్టి పంట భూములను సోలార్ ప్రయివేట్ కంపెనీకి మధ్య దళారులు భూములు లీజు ఒప్పందం చేయించడంలో దళారుల హవా కొనసాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం 400 మెగా వాట్లు విద్యుత్ ఉత్పత్తి చేసే సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనుంది. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ పత్తికొండ మండల పరిధిలోని హోసూరు -పెద్దహుల్తి గ్రామాల మధ్య 1800 ఎకరాలలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. రైతుకు సంవత్సరానికి ఎకరాకు రూ.31వేలు చెల్లించి లీజు ఒప్పందం చేసుకుంటుంది. రైతులు వేరుశనగ, ఉల్లి, వాము, జొన్న, కొత్తిమీర తదితర పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మధ్య దళారులు అమాయక రైతులకు మాయ మాటలు చెబుతున్నారు. సరైన సమయానికి వర్షాలు పడవు, పంటలు సక్రమంగా పండవని చెబుతూ రైతులను నట్టేట ముంచుతున్నారు. లక్షల విలువ చేసి పంట భూములను కారు చౌకగా ప్రయివేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారు. ఇప్పటికే రైతుల నుండి దాదాపు వెయ్యి ఎకరాలు లీజు ఒప్పందం జరిగినట్లు సమాచారం. కనీసం రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పేక్షక పాత్ర పోషిస్తూ రైతులను అన్యాయం చేస్తున్నారని రైతు సంఘాలు నాయకులు మండిపడుతున్నారు.

13 గంటల పనిపై నిరసనలు : రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన 13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టరేట్ ముందు, ఇతర ప్రాంతాల్లో ధర్నాలు నిర్వహించారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకి, పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని విధానం, ఉద్యోగ భద్రత, సమ్మె హక్కు లాంటి అనేక కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని, మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలు అమలు చేయాలని, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పర్యటన : కర్నూలు జిల్లాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పర్యటించారు. ముందుగా కర్నూలులోని ఉల్లి మార్కెట్‌యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఉల్లి రైతులు తమ కష్టాలను, బాధలను వి.శ్రీనివాసరావు చెప్పుకున్నారు. అనంతరం వి.శ్రీనివాసరావు పత్తికొండ పట్టణానికి చేరుకుని టమోటా మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఉల్లి, టమోటా పంటలు సాగు చేస్తున్న రైతులకు కనీస మద్దతు ధరలు కల్పించి ఆదుకోవాలని వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.అనంతరం ఆయన ఆదోని మండలం ఆరెకల్ వద్దకు చేరుకుని మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజాధనంతో నిర్మిస్తున్న మెడికల్ కాలేజ్ నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

టమోటా ధర పతనం : పత్తికొండ, ప్యాపిలి మార్కెట్ టమోటా ధర రోజురోజుకు పతనం కావడంతో టమోటా పంటను నేలపై పారబోస్తూ రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వ్యాపారస్తులు సిండికేట్ కావడంతో కిలో 50 పైసల నుంచి ఒక్క రుపాయికి కొనుగోలు చేయడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. వ్యాపారులు వర్షం, నాణ్యత పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నా మమ్మల్ని పట్టించుకునే వారు లేరంటున్నారు. సాగుచేసిన పెట్టుబడి రాకపోయినా పరవాలేదు కనీసం రవాణా చార్జీలు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెట్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి టమోటాలు కొనుగోలు చేయాలన్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

ప్రయివేట్ డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిగ్రీ కళాశాలలు బంద్ పాటించాయి. తమ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సేవా పర్వ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్‌యు పిజి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని పీజీ నాలుగవ సెమిస్టర్ ఫలితాలను వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు శనివారం విడుదల చేశారు.ఇందులో రెగ్యులర్ కింద 367 మంది పరీక్షలు రాయగా 360 మంది ఉత్తీర్ణులయ్యారు. సప్లమెంటరీ కింద 39 మంది పరీక్షలు రాయగా 30 మంది ఉత్తీర్ణులయ్యారు.

వర్షానికి దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు సిద్దయ్య

వర్ష బాధిత రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-పత్తికొండ

రైతులు సాగుచేసిన పంటలు అధిక వర్షాల వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని చిన్నహుల్తి, జూటూరు గ్రామంలోని పంట పొలాలను రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పత్తి ,ఉల్లి ,టమోటా, సజ్జ, కంది తదితరు పంటలు అధిక వర్షాల వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరిందన్నారు. సాగుచేసిన పెట్టుబడి కూడా చేతికి రాకుండా రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు కలుపుకొని ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులు మధు , మండగిరి గ్రామ అధ్యక్షులు రామాంజనేయులు, గోపాలు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా చౌక దుకాణల్లో సరుకులను సులభతరంగా తీసుకోవచ్చని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలోని గ్రామ సచివాలయంలో రేషన్ కార్డుదారులకు ఆయన స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం అందులో భాగంగా స్మార్ట్ కార్డులను అందజేస్తుందన్నారు. ఎటిఎం కార్డు తరహాలో ఉండే ఈ స్మార్ట్ కార్డులో కార్డు దారుడి ఫోటోతో పాటు కుటుంబ సభ్యులు , ప్రభుత్వ గుర్తింపు ముద్ర మాత్రమే ఉంటుందని తెలిపారు. గ్రామ టిడిపి సీనియర్ నాయకుడు కృష్ణ యాదవ్, విఆర్ఒ మద్దిలేటి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీ

కోడుమూరు : స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కోడుమూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి అన్నారు. కోడుమూరు టౌన్‌లో 13వ షాపులో టిడిపి నాయకుడు 13వ షాపు డీలర్ బోయకృష్ణ ఆధ్వర్యంలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఎరుకల బావి సమీపంలోని 3వవార్డు డీలర్ మాధవస్వామి రేషన్ దుకాణంలో కూడా కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

హిందూజా ఫైనాన్స్ కంపెనీ దౌర్జన్యం ఆపాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

తప్పుడు సర్వేనెంబర్ వేసి రిజిస్టర్ చేయించి ప్రలోభ పెట్టి ఫైనాన్స్ ఇచ్చి వేధింపులకు గురిచేస్తున్న హిందూజా కంపెనీ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి .రామకృష్ణ డిమాండ్ చేశారు. కర్నూలు ముజఫర్‌నగర్‌లో నివసిస్తున్న జాకీర్ హుస్సేన్ ఇంటికి తాళం వేసి బెదిరింపులకు పాల్పడుతున్న హిందూజా కంపెనీపై తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రామకృష్ణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్పలు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2021 వ సంవత్సరంలో ముజఫర్ నగర్ లో జాకీర్ హుస్సేన్, వారి కుటుంబ సభ్యులు నివసిస్తున్న ఇల్లు (ఇంటి నెంబర్ 77/1115) ప్రభుత్వం వారిని పేద కుటుంబంగా గుర్తించి 1990లో ఇచ్చిందని తెలిపారు.ఇది పక్కా ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 532 గా ఉందన్నారు. హిందూజా కంపెనీ వారు కొంతమంది ఏజంట్లను పెట్టి పేదలను జలగల్లాగా పీక్క తినడానికి ఎరవేసి ఫైనాన్స్ ఇచ్చి వడ్డీల రూపంలో వేసిన ఎత్తుగడలో ఒకటిగా జాకీర్ హుస్సేన్ కుటుంబమని తెలిపారు. వారికి ఇచ్చిన మొత్తం రూ.మూడు లక్షల 90 వేలు మాత్రమే కానీ ఫైనాన్స్ వారు, రూ.1 లక్ష బ్రోకర్‌కు ఇచ్చారన్నారు. రూ.60,000 ఇన్సూరెన్స్ పేరుతో మరొక రూ.20,000 వారి కంపెనీకి ఫీజు రూపంలో తీసుకున్నారని, మొత్తం రూ. 5, 70,000 అవుతుందని చెబుతున్నారన్నారు. ఇది వారికి తెలియ కుండా చేసిన మోసం అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో జాకీర్ హుస్సేన్ వారు ఇప్పటివరకు చెల్లించిన మొత్తం డబ్బులు రూ.330,000 ప్రస్తుతం వారు మొత్తం రూ. ఎనిమిది లక్షలు పైగా కట్టాల్సి వస్తుందని, ఆ డబ్బులు అన్ని తక్షణమే చెల్లించాలని, లేకపోతే ఇంటిని వేలం వేస్తానని లాయర్లను పోలీసులను తీసుకొని వచ్చి బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఇదేమిటి న్యాయం అని రామకృష్ణ ,సుధాకరప్ప ప్రశ్నించారు. వారికి ఇచ్చిన మొత్తం డబ్బులు చెల్లించినప్పటికీ వారు ఇంకా డబ్బులు కట్టాలని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆ ఇల్లు రిజిస్టర్ కావడానికి అవకాశం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు కొనడం అమ్మడం చెల్లదని, అయినా ఫైనాన్స్ కంపెనీ వారు సర్వే నెంబరు మార్చి అనగా 532 గా ఉన్నటువంటి 534 వేసి రిజిస్టర్ చేశారు. 532 ప్రభుత్వ భూమి కాబట్టి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇల్లు కాబట్టి 534 ప్రైవేట్ స్థలం కాబట్టి నెంబరు మార్చి రిజిస్టర్ చేసి బ్రోకర్లను పెట్టి ఆశపరిచి ప్రలోభ పెట్టి ఫైనాన్స్ ఇచ్చి ఇప్పుడు ఇల్లును స్వాధీనం చేసు చేసుకోవాలనే కుట్రతో హిందూజాకంపెనీ వారు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులు హిందుజా ఫైనాన్స్ వారి కాళ్ళ వేళ్ళ పడినప్పటికీ లేదు మళ్లీ సోమవారం వస్తే మీ పైన రూ.లక్ష అదనంగా పడుతుందని, తప్పనిసరిగా తాళం వేసి సామాను బయట వేసి ఇల్లును వేలం వేస్తామని బెదిరించారని తెలిపారు. దీన్నిబట్టి హిందూజా ఫైనాన్స్ కంపెనీ దుర్మార్గం స్పష్టంగా కనబడుతుందని చెప్పారు.

సదరు కంపెనీపై సంపూర్ణమైన విచారణ జరిపి వారు రిజిస్టర్ చేసుకున్న ఇల్లు ఎక్కడనో ప్రస్తుతం ఉన్న ఇంటికి తాళం వేసి బెదిరించే ఇల్లు ఎక్కడ ఉంది ఏ సర్వే నెంబర్లు ఉందో తెలుపాలని డిమాండ్ చేశారు.పేదలపైన ఈ రకమైనటువంటి దౌర్జన్యాలు ఆపకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సింది వస్తుందని హెచ్చరించారు. పోలీసు ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని సదరు హిందూజా కంపెనీ దౌర్జన్యాలను ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే హిందూజా కంపెనీ వారి వేధింపుల వల్ల జాకీర్ హుస్సేన్ భార్య సేకున్‌బీ ఇటీవల మరణించిందని, జాకీర్ హుస్సేన్ కు ముగ్గురు ఆడపిల్లలు వారి యొక్క సమస్యలతో సతమవుతమవుతున్న పరిస్థితి ఉందన్నారు.

జాకీక్ హుస్సేన్ కుటుంబానికి నోటీసు ఇస్తున్న హిందజా కంపెనీ న్యాయవాది , ఏజెంట్లు

జిజిహెచ్ లో వరల్డ్ హార్ట్ డే వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే (సెప్టెంబర్ 29వ తేదీ) వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.కార్డియాలజీ విభాగ వైద్యులతో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గుండె జబ్బులు మరణాలకు ప్రధాన కారణ మవుతున్నాయన్నారు. వీటిని నియంత్రించడానికి ఆరోగ్యకరమైన ఆహారం, నిత్య వ్యాయామం, ధూమపానం మానేయడం, మద్యపానం తగ్గించడం వంటి జీవనశైలి మార్పులు చాలా అవసరమని అన్నారు. ప్రజలు తమ గుండె ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ హైపర్‌టెన్షన్, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్, ఒత్తిడి (స్ట్రెస్) వంటివి గుండె సంబంధిత వ్యాధుల ప్రధాన కారకాలని తెలిపారు. ముందస్తు పరీక్షల ద్వారా వీటిని సమయానికి గుర్తించి నియంత్రించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒకసారి గుండె ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యమని వివరించారు. కార్యక్రమంలో కార్డియాలజీ విభాగ వైద్యులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ రవి కిరణ్, ఈ హాస్పిటల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్ పీజీలు, కార్డియాలజీ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ హార్ట్ డే వేడుకలో పాల్గొన్న డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ చిట్టినర్సమ్మ

సంజీవ సాగర్‌కు భారీగా వరద

- 2 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల

ప్రజాశక్తి-కోడుమూరు

అధిక వర్షాల వలన హంద్రీనదిపై నిర్మించిన దామోదరం సంజీవయ్య సాగర్‌కు(గాజులదిన్నె)కు ఇన్‌ఫ్లో 20,000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 2 గేట్లు ఎత్తి దిగువకు 15,000 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. హంద్రీ పరివాహక ప్రాంతంలో ఎవరు వెళ్లకూడదని సూచించారు. గాజులదిన్నె ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 4.5 టిఎంసిలు, ప్రస్తుత సామర్థ్యం 4.4 టిఎంసిలు ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. హంద్రి నదిలోకి ఎవరు వెళ్లకూడదని ఈ సందర్భంగా వారు తెలిపారు.

సి బెళగల్ చెరువు నిండి పారుతున్న అలుగు

సి బెళగల్ చెరువుకు జలకళ

-రైతు కళ్ళలో ఆనందం

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ చెరువులోకి వరద నీరు భారీగా చేరుకొంటుంది. ఎడతేరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువు ఎగువన పలు కాల్వల గుండా నీరు పొంగి పొర్లుతోంది. ఇందులోనే దిగువకు చెరువులోకి చేరి అది కూడా పూర్తిగా నిండుకొని జలకళను సంతరించుకొంది. అలుగు కట్ట ఎక్కి పారుతుండటంతో ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో వచ్చి జలకలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోనే ఐదవ అతి పెద్ద చెరువుగా సి బెళగల్ చెరువు నిండటంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు మూడు పంచాయతీల నడుమ చెరువు 1840 ఎకరాలలో విస్తరించగా రిజర్వాయర్ చేస్తే తాగు, సాగు నీటి కొరత లేకుండా పైర్లతో మండలం మొత్తం సస్యశామలంగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

6న సర్దార్ నాగప్ప పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భారత స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ నాగప్ప పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని అక్టోబర్ ఆరవ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎపి బహుజన విద్యావంతుల వేదిక నాయకులు రామశేషయ్య, నక్కల మిట్ట శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కర్నూలు నగరంలో పుస్తకావిష్కరణ సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సర్దార్ నాగప్ప జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పేర్కొన్నారు.

జాషువా రచనలు నేటి తరానికి దిక్సూచి

- అరసం జిల్లా అధ్యక్షులు ప్రహ్లాద

ప్రజాశక్తి - ఆదోని

నివాళులర్పిస్తున్న సభ్యులు

నవయుగ కవి జాషువా రచనలు నేటి తరానికి దిక్సూచి అని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కలం ప్రహ్లాద తెలిపారు. శనివారం జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుల దురహంకారం వల్ల ఎదుర్కొన్న తిరస్కారాలు, అవమానాలకు కుంగిపోకుండా, ఒక సవాలుగా తీసుకున్న వ్యక్తిగా గుర్రం జాషువా మిగిలారని తెలిపారు. ఆ పర్యావసానంగా హృదయంలో పెల్లుబికిన కవిత్వమే 'గబ్బిలం' అని చెప్పారు. తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువా చెరగని స్థానం సంపాదించుకున్నారని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడుస్తూ, అసమానతలు లేని సమ సమాజం కోసం పాటుపడాలని కోరారు. ప్రధాన వక్తగా హాజరైన సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప మాట్లాడుతూ... గుర్రం జాషువా తెలుగు పద్యాన్ని హృద్యమైన శైలితో ప్రత్యేక గుర్తింపును సంతరించుకున్నా రని తెలిపారు. ఎస్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న మాట్లాడుతూ... తనదైన విలక్షణమైన కవిత్వంతో, అభ్యుదయ భావజాలంతో, భావ కవితను వ్యతిరేకించి తల ఎత్తి నిలబడిన కవి జాషువా అని కొనియాడారు. యువ కవులు సక్కిరి భాస్కర్, రాజశేఖర్, రామాంజిలు తమ పాటలు, కవితలతో సభను అలరించారు. సాహితీ, భాషాభిమానులందరూ జాషువా చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. అరసం జిల్లా ఉపాధ్యక్షులు కెసి.మల్లికార్జున, సభ్యులు సత్యన్న, నాగన్న, ఎస్‌టియు పట్టణ అధ్యక్షులు రవి, అరసం జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్ బాబు, కొమ్ము ప్రసాద్, దాసరి వెంకటేష్, ఎస్‌టియు మండల అధ్యక్షులు సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం : టిడిపి

సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మాంట్ కార్మెల్ పాఠశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ జాన్సన్, జీజో, థామస్, జాకోబ్ ఫాదర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టిడిపి మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, జక్కనగేరి వెంకటేష్‌ల ఆధ్వర్యంలో జాబ్ మేళా ఆర్గనైజర్ అయ్యప్ప శర్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం, కౌతాళం మండలాల్లో ఉన్న నిరుద్యోగులు వేలాది సంఖ్యలో హాజరయ్యారని తెలిపారు. 50కి పైగా ప్రముఖ కంపెనీలు ఈ జాబ్‌మేళా నిర్వహించాయని చెప్పారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ, నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యారు. తహశీల్దార్ వేణుగోపాల్, ఎఒ వరప్రసాద్, సిఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతు రెడ్డి, టిడిపి నాయకులు కరణం సోమప్పగౌడ్, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, ముత్తు రెడ్డి, జ్ఞానేష్ పాల్గొన్నారు.

యువతకు విద్యార్థిని జ్యోతి ఆదర్శం : టిడిపి

ప్రజాశక్తి - నందవరం

మండల యువతకు విద్యార్థిని జ్యోతి ఆదర్శమని టిడిపి మండల కన్వీనర్ బాలీవిల తెలిపారు. శనివారం విద్యార్థిని జ్యోతిని శాలువాతో సన్మానించి ప్రోత్సాహకంగా ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలానికి చెందిన విద్యార్థిని జ్యోతి జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి జ్యోతి రాష్ట్రస్థాయి మహిళల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. విద్యార్థులు జ్యోతిని ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని తెలిపారు.

విద్యార్థినిని సన్మానిస్తున్న నాయకులు

భారీ వర్షాలు.. అపార నష్టం...

- నీట మునిగిన పంట పొలాలు
- 14 సెంటీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో గత రెండు నెలలుగా కురుస్తున్న భారీ వర్షాలతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. శుక్ర, శనివారాల్లో మండలంలో భారీ వర్షాలు కురవడంతో పత్తి, మిరప, టమోటా, ఉల్లి, ఆముదం, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. శనివారం 14 సెంటీమీటర్ల భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు, చెరువులు వరద నీటితో పొంగి పొర్లాయి. పంట పొలాల్లోకి నీరు చేరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

దేవనకొండ గ్రామానికి చెందిన హరిజన బ్రహ్మయ్య తనకున్న 1.50 ఎకరాలతో పాటు మూడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశారు. పత్తి పంట చేతికొచ్చే సమయానికి భారీ వర్షాలతో వంకలు పొంగి వర్షపు నీరు పంట పొలాల్లోకి చేరింది. ఆ రైతుకు రూ.1.20 లక్షల నష్టం వాటిల్లింది. అలాగే మహ్మద్, ఖాసీంలకు చెందిన పత్తి పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో పంట నష్టం వాటిల్లింది. పత్తి, టమోటా కాయలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అధిక వర్షాలతో రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. కుంకునూరు గ్రామానికి చెందిన రైతు ఉప్పర గంగన్న పొలంలో ఉంచిన 20 క్వింటాళ్ల పత్తి వరద నీటికి కొట్టుకుపోయింది. గద్దెరాళ్ల గ్రామానికి చెందిన రైతు నెట్టేకల్ 5 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని ఉల్లి, టమోటా, పత్తి పంటలు సాగు చేసారు. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో సమీపంలోని వాగు పొంగి వర్షపు నీరు పొలాల్లోకి చేరడంతో పంట పొలాలు నీట మునిగాయి. దేవనకొండ, నేలతలమరి, కరివేముల చెరువులు వర్షపు నీటితో నిండి పొంగి పొర్లడంతో వంకల్లోకి వరద నీరు చేరింది. వంకల వెంట ఉన్న పొలాలు వర్షపు నీటితో మునిగిపోయాయి. అలారుదిన్నె, తెర్నేకల్ హంద్రీ వాగు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహించింది. హంద్రీ వాగు వెంట ఉన్న వెలమకూరు, కుంకనూరు, పొట్లపాడు, బెల్లందొడ్డి గ్రామ పరివాహక ప్రాంతాల్లో పంట పొలాల్లో నీటమునిగాయి. ఆయా గ్రామాల్లో తహశీల్దార్ రామాంజనేయులు, ఎఒ ఉషారాణి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. దేవనకొండలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మాబాష, యూసుఫ్ బాష, యూనుస్‌కు చెందిన మట్టి ఇళ్లు కూలిపోయాయి. వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను, ఇళ్లు కూలిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం..!

- మృత్యువాత పడిన మూగ జీవాలు

ప్రజాశక్తి - కౌతాళం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాయుగుండం ఏర్పడి మండలంలో జలజీవనం అతలాకుతలమైంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఇక వర్షాలతో పంట పొలాలు దెబ్బ తినడమే కాకుండా మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. లక్ష్మీ నగర్ గుడివంక, బాపురం, రౌడూర్ వంకలు ఉధృతంగా ప్రవహించాయి. పత్తి పంట పొలాలు వర్షపు నీటితో మునగడంతో పత్తి కాయలు కుళ్లి పోతున్నాయి.. చెట్టుపై ఉన్న పత్తి నీట మునిగి ముద్దగా మారడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. కౌతాళం, రౌడూర్ బస్సు రోడ్డు పక్కకు వెళ్లడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

నీట మునిగిన పత్తి పంట

మూగజీవాలు మృతి : మండలంలోని హాల్వి గ్రామ సమీపంలో కందుకూరు హనుమయ్యకు చెందిన 50 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అధిక వర్షాలతో రెండు రోజులుగా నీటిలో నానుతూ అనారోగ్యానికి గురయి మృతి చెందినట్లు గొర్రెల కాపరి కన్నీరు మున్నీరయ్యారు. చిరుతపల్లి, మల్లనహట్టి గ్రామానికి చెందిన 15, గొర్రెల కాపరులకు చెందిన 30 గొర్రెలు మృత్యువాతపడ్డాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి

- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా డైరెక్టర్ రాముడు

భారీ వర్షాలతో మూగజీవాలు మృత్యువాత పడ్డాయని, గొర్రెల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం జిల్లా డైరెక్టర్ రాముడు కోరారు. ప్రభుత్వం సబ్సిడీతో మూగజీవాలకు కొనుగోలుకు రుణాలు అందించాలని, వాటి పోషణకు షెడ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు.

వర్షం జోరు.. నీటి హోరు..!

- భారీ వర్షాలకు గాజులదిన్నెలోకి పోటెత్తిన వరద

- గంజిహళ్లి మల్లెల వాగు ఉధృతం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో వర్షం జోరుగా కురవడంతో వర్షపు నీరు హోరెత్తింది. దీనికి తోడు హంద్రీ రివర్ బెల్ట్ ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గాజులదిన్నె ప్రాజెక్టులోకి వరద నీరు పోటెత్తింది. 4.5 టిఎంసిల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులోకి 4.3 టిఎంసిల నీరు చేరింది. ప్రాజెక్టు అధికారులు ఏప్పటికప్పుడు నీటి ప్రవాహాన్ని కనిపెడుతూ నీటిమట్టాన్ని గరిష్ట స్థాయిలో స్థిరంగా ఉంచుతున్నారు. శుక్రవారం రాత్రి ప్రాజెక్టులోకి సుమారు 18 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరుతోందని గుర్తించిన అధికారులు ప్రాజెక్టు ఈఈ పాండురంగయ్య సూచనల మేరకు శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకే రెండు గేట్లను ఎత్తి 16 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు ప్రాజెక్టు ఎఇ చిన్న అలీ తెలిపారు.

మల్లెలవాగు ఉధృతిని పరిశీలించిన తహశీల్దార్

ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీటితోపాటు గాజులదిన్నె ప్రాజెక్టు బ్యాక్ వాటర్ చేరడంతో గంజిహళ్లి మల్లెల వాగు ఉగ్రరూపం దాల్చింది. గంజిహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి వరదనీరు భారీగా చేరింది. మల్లెల వాగు ఉధృతంగా ప్రవహించడంతో గంజిహళ్లి నుంచి బైలుప్పల, బి.అగ్రహారం, తెర్నేకల్, బన్నూరు, ఆస్పరి మండలంలోని గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయి. తహశీల్దార్ రాజేశ్వరి, ఆర్ఐ రామయ్య సిబ్బందితో కలిసి గంజిహళ్లి గ్రామంలో పర్యటించి మల్లెల వాగు ఉధృతిని పరిశీలించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వర్షం తగ్గి మల్లెలవాగు ఉధృతి పూర్తిగా నిలిచిపోయే వరకు బయటికి వెళ్లరాదని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

కరువు మండలంగా ప్రకటించాలి : సిపిఎం, సిపిఐ

మండలంలో భారీ వర్షం కురవడం వల్ల, గంజిహళ్లిలోని మల్లెల వాగు ఉధృతి, జిడిపి బ్యాక్ వాటర్ వల్ల రైతులు సాగు చేసిన పత్తి, ఉల్లి, మినుములు, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారని, మండలాన్ని కరువుగా ప్రకటించాలని సిపిఎం నాయకులు బి.కరుణాకర్, రైతుసంఘం మండల నాయకులు నరసింహులు, సిపిఐ నాయకులు మద్దిలేటి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టు నుంచి దిగివకు విడుదలవుతున్న నీరు

అధిక వర్షాలకు తెగిపోయిన రోడ్డు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని ములుగుందం గ్రామంలో కురుస్తున్న అధిక వర్షాల వల్ల చెరువు కట్ట తెగి ఆదోని, తెర్నేకల్లుకు వెళ్లే రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహన దారులు, గ్రామస్తులు శనివారం కోరారు.

కోతకు గురైన ఆర్అండ్‌బి రోడ్డు

దంచి కొట్టిన వర్షం...

- నీళ్లలో తడిసిన వస్తువులు
- ఆదుకోవాలంటూ మొర

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో వర్షం దంచి కొట్టింది. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. శనివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. ఇళ్లల్లో నీరు చేరి నిత్యావసర సరుకులు తడిసిపోవడంతో ప్రజలు పస్తులతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాంజల మరోసారి పొంగిపొర్లడంతో ఉధృతంగా ప్రవహించింది. అన్యాక్రాంతం, అక్రమ కట్టడాల వల్ల నీరు పారేందుకు ఆటంకం కలగడంతో హౌసింగ్ బోర్డు కాలనీ, ఖునీమహల్, బార్ పేట్, కౌడల్‌పేట్, బుడేకల్, వడ్డే గేరి, బోయగేరి, నిజాముద్దీన్ కాలనీ, ప్రశాంత్ నగర్, అరుణ్ జ్యోతి నగర్ ప్రాంతాలు జలమయమయ్యాయి. గణేష్ సర్కిల్ ప్రాంతంలో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో చెరువును తలపించాయి. ఇళ్లల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మున్సిపల్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. రాంజల వంక ఉధృతంగా ప్రవహించడంతో హౌసింగ్ బోర్డు కాలనీకి చేరుకునే ఆదిత్య నర్సింగ్ హోమ్ వద్ద గెస్ట్ హౌస్ సమీపంలో వంక ఉధృతంగా ప్రవహించడంతో మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటన

భారీ వర్షం కారణంగా బుడేకల్, వడ్డే గేరి, హౌసింగ్ బోర్డు కాలనీ, కౌడల్ పేట ప్రాంతాల్లో నడుము లోతు నీళు నిలిచిపోయాయి. ఆ ప్రాంతంలోని ప్రజలు రోడ్డుపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ పరిస్థితులు తెలుసుకునేందుకు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్, ఐదో వార్డ్ కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప నీటిలోనే నడుచుకుంటూ సమస్యను తెలుసుకున్నారు. నిలిచిన నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ముందుకొచ్చిన దాతలు : నిత్యావసర సరుకులు తడిసి వంట చేసుకునేందుకు కూడా అవకాశం లేని వారి కడుపు నింపేందుకు దాతలు ముందుకొచ్చారు. హౌసింగ్ బోర్డు కాలనీలో కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. టిడిపి పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప ఆధ్వర్యంలో కౌడల్‌పేట్ ప్రాంతంలో ఆహారం అందించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, యువ నాయకులు మారుతి నాయుడు 150 కిలోల అన్నం వండించి వరద బాధితుల కడుపు నింపారు. డీఎస్పీ బంగ్లా ప్రాంతంలో ఇళ్లలో నీరు చేరి నిరాశ్రయులైన వారికి పారిశ్రామికవేత్త విట్టా రమేష్ వంట తయారీ చేయించి వడ్డించారు. ఇళ్లల్లో నీరు చేరిన వారిని ఫంక్షన్ హాలు, పాఠశాలలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కమిషనర్ కృష్ణ తెలిపారు.

రికార్డు స్థాయి వర్షపాతం

ఆదోని 126.2 మిల్లీమీటర్లు, మంత్రాలయం 99.4, ఎమ్మిగనూరు 88, నందవరం 85.6, గోనెగండ్ల 83.6, పెద్దకడబూరు 76.4, కౌతాళం 66.2, కోసిగి 50.2, హొళగుంద 46.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు.

కంటికి కునుకు లేదు

- ఈరమ్మ, బాధితురాలు డీఎస్పీ బంగ్లా ప్రాంతం

పట్టణంలోని డీఎస్పీ బంగ్లా సమీపంలో వంక ఉధృతంగా ప్రవహించింది. వంక పొంగిపొర్లడంతో సమీపంలో నివాసముంటున్న ఇళ్లల్లోకి వరద నీరు భారీగా చేరింది. అర్ధరాత్రి నుంచి కంటి మీద కునుకు లేకుండా పోయింది. అలాగే నిలిచి ఉన్నామని కాలనీ మహిళలు మస్తానమ్మ, ఈరమ్మ వాపోయారు. తిండి గింజలు, బట్టలు తడిసిపోయాయి. వంక ఉధృతిలో వస్తువులు, ఐదు మేకలు కొట్టుకుపోయాయి. పస్తులతో గడిపాం. దాతలు ముందుకొచ్చి ఆహారం ప్యాకెట్లు ఇచ్చారు. అధికారులు మాత్రం ఎలాంటి చర్యలూ చేపట్టలేదు

బాధితుల సౌకర్యార్థం హెల్ప్ లైన్ : కృష్ణ, కమిషనర్

వాతావరణ శాఖ సూచన మేరకు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఆదోనిలో రాంజల చెరువు సమీపంలో ఉండే హౌసింగ్ బోర్డు కాలనీ వంక పరివాహక ప్రాంతాలైన బార్‌పేట్, కౌడల్ పేట్, కల్లుబావి ప్రాంతాల వాసులను అప్రమత్తం చేశాం. ఇళ్లల్లో నీరు చేరిన, వరదకు గురైన వారి సౌకర్యార్థం మున్సిపల్ కార్యాలయంలో 24 గంటలు హెల్ప్ లైన్ ఏర్పాటు చేశాం. ఏదైనా సమస్య తలెత్తితే 8977766403 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

హౌసింగ్ బోర్డు కాలనీలో ఉధృతంగా ప్రవహిస్తున్న రాంజల వంక

లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్, కమిషనర్

ఆవు దూడ వంకను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

- సహకారం సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు

ప్రజాశక్తి - కౌతాళం

ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని కూటమి ప్రభుత్వం చేపడుతోందని సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు తెలిపారు. శనివారం స్థానిక పాత మారమ్మ గుడి వద్ద ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రేషన్ సరఫరాలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా రేషన్ సరుకులు అందించేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం ఈ స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకొచ్చిందని తెలిపారు. టిడిపి నాయకులు సౌద్రి బసవరాజ, సొసైటీ డైరెక్టర్ కురువ వీరేష్, టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ రాజానంద్, సులేకేరి గిరి, డీలర్ అయ్యప్ప, నరసప్ప, తెలుగు యువత నాయకులు గొట్టయ్య, నబీ, లింగన్న, రమేష్, గురు పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలం మాధవరం, చెట్నిహళ్లి గ్రామాల్లో టిడిపి నాయకులు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మాధవరం గ్రామంలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి గ్రూపు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి లబ్ధిదారులకు అందజేయగా.. చెట్నిహళ్లి గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి గ్రూపు, మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. టిడిపి నాయకులు కృష్ణ మోహన్ రెడ్డి, చెట్నిహళ్లి సర్పంచి అంజిని, విఆర్ఒ భీమయ్య, నాయకులు మేకల మల్లేష్, సెక్రటరీ మహేష్, సిబ్బంది చంద్ర పాల్గొన్నారు. అలాగే రామచంద్ర నగర్ కాలనీలో టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, నాయకులు నరసింహ, శివ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గోవిందు, విఆర్ఎ నరసయ్య పాల్గొన్నారు. **ఆస్పరి** తహశీల్దార్ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులను డీలర్లకు అందజేశారు. రేషన్ కార్డులను 1న రేషన్‌కు వచ్చిన లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి సూచించారు. విఆర్ఒలు వీరేష్, హరికృష్ణ పాల్గొన్నారు. **నందవరం** మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జోరుగా సాగింది. కూటమి నాయకులు, అధికారులు ఉదయం నుంచి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నాగలదిన్నె గ్రామంలో కార్డుల పంపిణీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. టిడిపి నాయకులు ఎస్ఎ.జబ్బార్, శేషాద్రి తిమప్ప, మునాఫ్, ఎస్ఎ.మునాఫ్, ఉరుకుంద, మల్లేష్, రవిగౌడ్ పాల్గొన్నారు. **చిప్పగిరి** తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 13 పంచాయతీలకు గాను మొత్తం 24 రేషన్ షాపులకు సంబంధించిన 8,727 స్మార్ట్ కార్డులు వచ్చాయన్నారు. ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ వీరేష్ పాల్గొన్నారు. **హోళగుంద** తహశీల్దార్ కార్యాలయంలో కొత్త రేషన్ కార్డ్ పంపిణీపై సచివాలయ ఉద్యోగులు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు.

కౌతాళంలో కార్డులను పంపిణీ చేస్తున్న నాయకుల

మంత్రాలయం

నందవరం

అధికారుల సూచనలు పాటించాలి

- హార్టికల్చర్ అధికారి ఇందిర

ప్రజాశక్తి - ఆస్పరి

టమోటా పంటను పరిశీలిస్తున్న ఇందిర

రైతులు సాగు చేసిన పంటల్లో వర్షపు నీరు చేరి పూర్తిగా దెబ్బతినకుండా అధికారుల సూచనలు పాటించాలని ఆలూరు హార్టికల్చర్ అధికారి ఇందిర తెలిపారు. శనివారం ఆస్పరి గ్రామ సమీపంలో రైతు నాగరాజు సాగు చేసిన టమోటా పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వారం రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో వర్షపు నీరు చేరి కూరగాయల పంటల్లో మొక్కలు బలహీనంగా మారి పోషకాలు తీసుకోలేవని తెలిపారు. వర్షం ఆగిన వెంటనే మొక్క కోలుకో వడానికి 19:19:19, 13045 గల నీలి మందు ఐదు గ్రాముల లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఆకులు పోషకాలను గ్రహించి మొక్క కోలుకోవడానికి సహాయ పడతాయని తెలిపారు. విలేజ్ హార్టికల్చర్ అధికారి షేక్ షనవాజ్ పాల్గొన్నారు.

వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

- టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వంక ఉధృతిని పరిశీలిస్తున్న కదిరికోట ఆదెన్న

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని కలుగొట్ల రోడ్డులో ఉన్న జీర్ జీర బండ వంక పొంగి పొర్లు తుండడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలనీ వాసులు సమస్యను టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న దృష్టికి తేవడంతో శనివారం ఆయన వంక ప్రవాహాన్ని స్థానికులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... ఈ సమస్య చాలా ఏళ్లుగా ఉందని, వంక వంతెనను ఎత్తు పెంచి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. భారీ వర్షాలకు వంక పొంగిపొర్లుతుండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలగడమే కాకుండా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలనీ (న్యూ ఎస్సీ కాలనీ)లో వంక పక్కన ఉండే ఇళ్లలోకి నీరు చేరే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ వంక ప్రవాహాన్ని సంబంధిత అధికారులు పరిశీలించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి ఎస్సీ కాలనీ సీనియర్ నాయకులు రోజా ఆర్ట్స్ ఉసేని, జగతాప్ జై పాల్ పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. శనివారం ఎఒ ఎం.వరప్రసాద్ సిబ్బందితో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... కోసిగి, దుద్ది, కామనదొడ్డి గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించినట్లు తెలిపారు. దెబ్బతిన్న పంటలను నమోదు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

క్రీడల్లోనూ ప్రతిభ చాటాలి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల చైర్మన్ సతీష్

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల చైర్మన్ విట్టా సతీష్ తెలిపారు. కళాశాలలో రాయలసీమ విశ్వవిద్యాలయం డిగ్రీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. కళాశాల ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ మాట్లాడారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పోటీలను కళాశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించగా విజయవంతంగా జరిగాయన్నారు. పోటీల్లో జిల్లా పరిధిలోని 13 డిగ్రీ కళాశాలల జట్లు పాల్గొనగా.. రాయలసీమ విశ్వవిద్యాలయం, ఆదోని ఆర్ట్స్ కళాశాల జట్లు ఫైనల్‌లో తలపడ్డాయని తెలిపారు. ఆదోని ఆర్ట్స్ కళాశాల జట్టు విజయం సాధించగా, రాయలసీమ విశ్వవిద్యాలయం రన్నర్‌గా నిలిచిందన్నారు. కళాశాల కరస్పాండెంట్ దైవాధీనం రెడ్డి, ప్రిన్సిపల్ మురళీ మోహన్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. విశ్వవిద్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ శివ కిశోర్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎరిస్వామి, పిఇటిలు శివ కుమార్, చెన్న బసవ, హరి, బసవ రాజు, రవి, కేశవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉధృతిలో వాగులను దాటడం ప్రమాదం : తహశీల్దార్, సిఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్న వాగులను దాటే ప్రయత్నం చేయడం ప్రమాదమని తహశీల్దార్ కె.రమాదేవి, సిఐ రామాంజులు హెచ్చరించారు. శనివారం మండలంలోని మాలపల్లి గ్రామ సమీపంలో ఉన్న వరద నీటితో పరుగులు పెడుతున్న వాగును పరిశీలించారు. రోడ్డుకిరువైపులా వాహనాలు రావడం గమనించిన వారు వాహనదారులను నిలిపి గ్రామస్తులను పిలిపించి జెసిబితో వాగులో పేరుకుపోయిన ముళ్ల కంపలను తొలగించి వాగులో ఉన్న నీటి ప్రవాహాన్ని తగ్గించారు. వాహనాల రాకపోకలు సాగించారు. వారు మాట్లాడుతూ... ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు దాటే సాహ సం చేసి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సూచించారు. ఆర్ఐ జనార్ధన్ రావు, విఆర్ఒలు భీమయ్య, ప్రభాకర్ ఉన్నారు.

కోట్లకు ఘననివాళి

ప్రజాశక్తి - ఆదోని

మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రాజకీయ విలువలు కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారని కాంగ్రెస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ధోకా తెలిపారు. శనివారం విజయభాస్కర్‌రెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ అధ్యక్షులు సాయినాథ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ యువజన నాయకులు దేవిశెట్టి వీరేష్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు శ్రీనిత్, జయరాం, నిస్సార్ అహ్మద్, తాయన్న, మద్దిలేటి ఉన్నారు.

నిరాశ్రయులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

భారీ వర్షాల కారణంగా నిరాశ్రయులైన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదోనిలో వాగులు, వంకలు, కుంటలు ఆక్రమించుకోవడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు ఇళ్లలోకి చేరి పేదలు ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన తెలిపారు. శనివారం పట్టణంలో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు కౌడల్ పేట్, బార్ పేట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను నాయకులు వీరేష్, వెంకటేష్‌తో కలిసి పరామర్శించారు. పట్టణంలో వాగులు, వంకలు, కుంటలను కొంతమంది ఆక్రమించుకోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజల జీవనం అతలాకుతలమైందని చెప్పారు. ఇళ్లలోకి నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, బట్టలు, పూర్తిగా తడిసి ముద్దయ్యాయని తెలిపారు.

శ్రీమహా గౌరీదేవిగా అమ్మవారు

ప్రజాశక్తి - నందవరం

గురజాల గ్రామం శ్రీరామలింగేశ్వర దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం పంచమి రోజున శ్రీపార్వతి అమ్మవారు శ్రీమహా గౌరీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆలయ నిర్వాహకులు అలంకరించారు. శ్రీరామలింగేశ్వర స్వామికి, పార్వతి దేవి అమ్మవారికి రుద్రాభిషేకం, అలంకరణను గురజాల పైగేరి భక్తుల సమక్షంలో చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దేవాలయంలో అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

CHANGE OF NAME

I, Vasagiri Lakshmi devi @ S.Aruna w/o late V.Sudhakar R/o H.no. 1/65, BC colony, Billekallu (V), Aspari(M) , Kurnool(D) have changed my name from S.Aruna to VASAGIRI LAKSHMI DEVI in Rural postal life insurance policy no. R-AP-EA-713630 as per affidavit dt :12-8-25 executed in presence of notary public,Adoni kurnool (D)

పేదరికం అడ్డు కాదు...

- నిరూపించిన యువకుడు

- డీఎస్సీలో మూడు ఉద్యోగాలకు అర్హత

ప్రజాశక్తి - కోసిగి

చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించి ఒకే డీఎస్సీలో మూడు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించుకున్నాడు ఆ యువకుడు. మండలంలోని దుద్ది గ్రామానికి చెందిన గుండుపాగి ఎంకన్న, జయసింతమ్మ దంపతుల కుమారుడు గుండుపాగి ఆనంద్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీలో ఒకేసారి మూడు ఉద్యోగాలకు అర్హత సాధించారు. స్కూల్ అసిస్టెంట్ 86.5, పిఇటిలో 82.5, ఫిజికల్ డైరెక్టర్‌లో 81.5 మార్కులు సాధించి మూడు ఉద్యోగాలకు అర్హత సాధించారు. మొదటి ప్రాధాన్యతగా స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం ఎంచుకున్నారు. ఇటీవల అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉద్యోగ అర్హత పత్రం అందుకున్నాడు. అనంతరం ఉద్యోగ నియామక పత్రాన్ని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆనంద్‌కు అందజేశారు. మారుమూల గ్రామమైన దుద్దిలో ఓ దళిత కుటుంబానికి చెందిన ఆనంద్ ఒకే డీఎస్సీలో మూడు ఉద్యోగాలకు అర్హత సాధించడం పట్ల గ్రామస్తులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఆనంద్ పెయింటింగ్‌తో డ్రాయింగ్ పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ నిర్వహించేవారు. ఇటీవల మెగా డీఎస్సీలో 16 వేలకు పైగా ఉద్యోగాలు మంజూరు కావడంతో ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఒంగోలులో కోచింగ్‌కు వెళ్లారు. తల్లిదండ్రులు సైతం కూలి పనికి వెళ్లి వచ్చిన డబ్బులో కొంత ఆనంద్‌కు పంపేవారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఆనంద్ మూడు ఉద్యోగాలు సాధించడంతో ఆ కుటుంబంలో ఆనందానికి అవధుల్లేవు. స్కూల్ అసిస్టెంట్‌గా 86.5 మార్కులు సాధించి కర్నూలు జిల్లాలో 6వ స్థానంలో నిలిచారు. ప్రతి ఒక్కరూ ఆనంద్‌ను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో యువకులు ఉద్యోగాలు సాధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాఘవేంద్ర రెడ్డి నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఆనంద్